# మనోరమ

ప్రకృతి వసంత శోభతో వింతరంగులు సంతరించుకుంది. ఆనాడు ఆ పర్వతప్రాంతమంతా గంధర్వులు, విద్యాధరులు, కిన్నరులు విలాసంగా విహరిస్తున్నారు.

ఇందీవ రాక్ష గంధర్వుని కూతురు మనోరమ. అప్పుడే యౌవనంలో అడుగిడుతున్న, ఇంకా బాల్యం పూర్తిగా వదలని మనోరమ స్నేహితురాళ్ళతో కలసి వనవిహారానికి బయలుదేరింది.

మనోరమ ప్రకృతి సౌందర్యానికి పరవశిస్తూ, తీగల్లో తీగలా ఆ ఉద్యానవనంలో కలసి పోయింది. సుకుమారి మనోరమ ఎర్రని పాదాలు మరీ ఎర్రబారాయి, లేచెమట శరీరమంతా నిలబడింది. అయినా ఉత్సాహంతో స్నేహితురాళ్ళతో కలసి పర్వతశిఖరాలు అధిరోహించింది. దగ్గరున్న సెలఏరులో పాదాలు ముంచి కలకల నవ్వుతుంటే, పక్కనున్న కళావతి, విభావసి, మనోరమ రాగరంజితాలై, మంజీరాలతో ముచ్చటగొలుపుతున్న పాదాలు చూస్తూ "అవునుమరి, అల్లారు ముద్దు బిడ్డవి, నీకాలి మంజీరాలు ఘల్లుమంటేచాలు మీనాన్న సింహాసనం దిగి నిన్ను ఎత్తుకునేవాడు. అలాటి సుకుమారివి మాతోబాటు ఈ ప్రాంతమంతా తిరుగుతుంటే పాదాలు కందిపోవూ" - విభావసి మనోరమ పాదాలవంకే చూస్తూ అంది.

"ఆపర్వత ప్రాంతమంతా మనకి తెలిసిందేగా.... మా విద్యాధరులు, గంధర్వులు తిరిగే ప్రాంతమే ఇదంతా...గబగబా నడవండి మరి" - మనోరమ ముందు నడుస్తుంటే ఆమె ప్రాణస్నేహితులు కళావతి, విభావసి వెంటనడిచారు.

ఆ ప్రాంతమంతా పూలతో కలకలలాడుతోంది....ఎక్కడా చూసినా పుప్పొడి పొన్నులా ప్రకాశిస్తోంది. తుమ్మెదలు ఝుంకారంతో కదలటంలేదు.

మనోరమ పూలుకోయాలనే ఉత్సాహంతో ముందుకు పరిగెత్తి, ఒక్కసారిగా ఆగిపోయింది. ఆమె పాదాలు ముందుకు కదలటం లేదు.

దగ్గరలో ఒకగుహ ఆ గుహద్వారం గడ్డితో మూసుకుపోయింది. స్నేహితురాళ్ళను వెంటబెట్టుకు గుహకు మరీ దగ్గరగా వచ్చి నిలబడింది మనోరమ.

అదో దూదిరాశి. అది ఒక మహర్షి శరీరం... కృశించి. నరాలు బయటపడి, తెల్లనిజుట్టు, తెల్లనిగడ్డంతో, చిత్రంగా కనిపించింది చూడ్డానికి మనోరమకు.

స్నేహితురాళ్ళు తొందరచేస్తున్నారు వెళ్ళిపోదామని, మనోరమలో బాల్యచాపల్యం తలెత్తింది.

"ఉండవే కళావతి, ఈ దూదిరాశిలావున్న మహర్షికి నోరేదే, కళ్ళేవీ... ఇవేనా" వేళ్ళతో తుడముతూ కిలకిలా నవ్వింది మనోరమ.

"మనకెందుకు – పూలు కోయటానికి వచ్చాం,.పోదంపాద" తొందరచేసింది స్నేహితురాలు.

"అ–ఇదే, ఇదే నోరు, ఇవే కళ్ళు" మళ్ళీ విరగబడి నవ్వింది మనోరమ – మహర్షి ధ్యానం భంగమయింది. కళ్ళలో నిప్పులు కురిసాయి.

"నీ యౌవనపు పొంగు నాపై చూపక, ఫో" – మనోరమ ఇంకా నవ్వుతూనే ఉంది, మహర్షికోపం అతిశయించింది.

"వృద్ధుణ్ణి అవమానపరుస్తున్నావే – నీవు ఒక రాక్షసుడికి పట్టుబడు – ఫో, కదులు" – గర్జించాడు మహర్షి

మనోరమ నిలువెల్ల ఒణికిపోయింది. బాల్యచాపల్యం క్షణంలో పటాపంచలైంది. రాక్షసుని భయంకర రూపం కళ్ళ ముందునిల్చింది. ఈ రూపాన్ని ఎలా కట్టుకోకలదుతను!!! మనోరమ కన్నీళ్ళు చెక్కిళ్ళ మీదుగా జాలువారుతున్నాయి.

ఈ తపోధనుడైన మహర్షి తనను క్షమిస్తాడా? మనోరమకు భవిష్యత్తంతా అంధకారబంధురంలా తోస్తోంది.

స్నేహితురాళ్ళు మహర్షి వంక, మనోరమ వంక ఏమీ తోచక చూస్తూ నిలబడ్డారు.

నిముషాలు నిశ్శబ్దంగా గడిచాయి. "ఋషీశ్వరుడవని ఊరుకుంటున్నాం. మేము ముగ్గురము తల్చుకుంటే నిన్ను ఏమైనా చేయగలం" – ముందుకు దూకింది విభావసి.

ముగ్గురూ మహర్షి కళ్ళ ముందు కనిపిస్తూన్నారు. తమ స్నేహితురాలిని రక్షించుకోటం కోసం ఏమైనా చేయడానికి సిద్ధంగా వున్నారు కళావతి, విభావసి. మహిర్షి గుడ్లు ఉరిమాడు.

"మీరిద్దరూ క్షయరోగంతో కృశించండి –కొండగుహలు మహర్షి కోపాన్ని ప్రతిధ్వనింపచేసాయి.

విధి ఎంత చిత్రమైందో, పూలుకోయడానికి వచ్చిన తను, తన స్నేహితురాళ్ళు ఈ ఘోరశాపానికి గురికావటమేమిటో అంతుచిక్కని మనోరమ శూన్యంలోకి చూస్తూ అక్కడే నిలబడింది. అంతలోనే ఏదో పెద్ద ధ్వని – ఏదో సందడి – వేట కుక్కల పరుగులు, అడవిపందుల పరుగులు – అయ్యో! దిక్కుతోచని మనోరమ పరుగులు తీసింది....పరుగులు – పరుగుల, అడవి అంతా పరుగుపెట్టింది. – నిజంగానే, రాక్షసుడు తనను వెంటాడుతున్నాడు. ఘోరమైన రూపం, వికృతమైన కోరలు, మిడిగుడ్లు, చేతిలో పుఱ్ఱె, దాన్నిండా రక్తం – ఈ రాక్షసుని బారి నుంచి ఎలా బతికి బయట పడగలనో అనుకుంటూ, ఈ భయంకరమైన అరణ్యంలో తనని రక్షించేవారెవరో అని కొండగుహలు, అరణ్యాలు మారుమ్రోగేటట్లుగా రోదిస్తూ, ప్రాణాలు అరచేతపెట్టుకుని పరుగు తీస్తోంది మనోరమ.

మృగయాసక్తుడై వచ్చిన స్వరోచి మహారాజు చెవిని తాకింది, ఆ ఆర్తనాదం, ఒక నిస్సహాయురాలైన అబల ఆక్రందనం.

ఆర్తనాదం వినవచ్చిన దిక్కే గుర్రాన్ని పరుగుతీయించాడు. అంతలోనే, రాక్షసుడు తరుముకొస్తున్న స్త్రీమూర్తి గజగజవణకుతూ అప్రయత్నంగా మహారాజు వెనక దాగింది.

భయంకరమైన యుద్ధంలో ఓడిపోయిన రాక్షసుడు స్వరోచి ముందు చేతులు జోడించి నిలిచాడు.

శాపవిముక్తుడైన ఇందీవరాక్షగంధర్వుడను నేనేనని సజలనయనాలతో స్వరోచిని చూస్తుంటే, విస్తుపోయింది మనోరమ.

తాను వరూధిని సోదరుడనన్నాడు ఇందీవరాక్షుడు. ఇదీ మరీ ఆశ్చర్యాన్ని కలిగిస్తుంటే స్వరోచి మనోరమ వంక కంటిరెప్పవేయకుండా చూస్తుండి పోయాడు.

ఈ మహావీరుడు మహారాజు, తన మేనేల్లుడని, వరూధిని కుమారుడేనని తెలిసిన ఇందీవరాక్షుడు ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు.

'ఈమె నా కూతురు మనోరమ' ఆనందబాష్పాలు అడ్డుపడుతుంటే, స్వరోచిని, మనోరమని చూస్తూ పరవశించిపోయాడు ఇందీవరాక్షుడు.

మహారాజు స్వరోచి తన అత్తకొడుకేనా – మనోరమ బుగ్గల్లో సిగ్గుదొంతరలు తొణికిసలాడుతుంటే తలవంచి క్రీగంట చూసింది స్వరోచిని.

స్వరోచి మనోరమలకు వైభవోపేతంగా వివాహం జరిపించాడు ఇందీవరాక్షుడు. తన శాపాన్ని పోగొట్టిన స్వరోచి ఋణం తీర్చుకున్నానని ఇందీవరాక్షుడు ఆనందపడుతూ, తన వద్ద నున్న ఆయుర్వేద విద్యను కూడా అల్లుడికి కానుకలతో పాటు కానుకగా అర్పించాడు.

గతమంతా ఒక కలలా అనిపిస్తుంటే స్వరోచి కౌగిలిలో ఒదిగిపోయింది మనోరమ.

- కావ్యతారలు - వనిత - 1989